క్లుప్తంగా

'కంటి వెలుగు'తో వృద్ధుల జీవితాల్లో వెలుగు



తరిగొప్పుల: కంటి వెలుగు పథకంతో వృద్ధుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని సర్పంచ్ దామెర ప్రభుదాస్ అన్నారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించగా ప్రత్యేకంగా తయారు చేసిన కంటి అద్దాలను శనివారం వృద్ధులకు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జనగ్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ జుంలాల్‌నాయక్, సుదర్శన్‌గౌడ్, లింగం ఉన్నారు.

చిన్నారులకు డి విటమిన్



జనగామ: జిల్లా కేంద్రంలోని చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో శిశువులకు డి విటమిన్ అందేలా కుటుంబ సభ్యులు ఎండలో కాసేపు ఉన్నారు. రోగ నిరోధక శక్తితో పాటు ఎముకల దృఢత్వానికి డి విటమిన్ ఎంతగానో ఉపయోగపడుతుందని డాక్టర్ సూచన మేరకు రోజు ఇలా చేస్తున్నారు.

రజక వృత్తిదారుల బడ్జెట్ సవరించాలి



జఫర్‌గఢ్: రజక వృత్తిదారులకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సవరించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మైలారం వెంకటేశ్వర్లు, ఏదునూరి మదార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్లను శనివారం మండల కేంద్రంలో ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతి రజిత యాకయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. నల్లతీగల చిరంజీవి, మాడరాజు సంతోష్, గుడికందుల సమ్మయ్య, నల్లతీగల యాకయ్య, సోమయ్య, శ్రీనివాస్, ఆంజనేయులు, మొగిళి, సాయిలుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నర్సయ్య మృతి పార్టీకి తీరని లోటు

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి(జి)కి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మారపల్లి నర్సయ్య మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ సీనియర్ నాయకులు అన్నారు. శనివారం నర్సయ్య మృతదేహాన్ని సందర్శించి వారు ఘనంగా నివాళులర్పించారు. నాయకులు అన్నెబోయిన భిక్షపతి, సిహెచ్ కృష్ణమూర్తి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, పార్టీ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య, ఇల్లందుల బాబు, రాజు, డానియల్, యాదగిరి, తిరుపతి ఉన్నారు. కాగా, నర్సయ్య కుటుంబాన్ని ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి, వ్యవసాయ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ గుజ్జరి స్వరూప, ఎంపీటీసీ సభ్యులు చిలువేరు శివయ్య తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని రాఘవాపూర్‌కు చెందిన కందుల నాగేశ్వరరావు బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. నాగేశ్వరరావు రైల్వేగ్యాంగ్ మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రోజూ మాదిరిగానే విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి రాఘవాపూర్‌కు వస్తుండగా రాఘవాపూర్ బస్‌స్టేజీ వద్ద హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు కాలికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం హనుమకొండకు తరలించారు. కాగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు.

ఎక్సైజ్ దాడులు

జఫర్‌గఢ్: మండలంలోని రేగడితండా గ్రామ శివారు టీబీతండా, లక్ష్మీనాయక్‌తండా, లింబానాయక్‌తండాలో నాటు సారా స్థావరాలపై పాలకుర్తి ఎక్సైజ్ సీఐ సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో లింబానాయక్‌తండాకు చెందిన గుగులోతు నాజమ్మ నుంచి 2 లీటర్ల నాటు సారా, 50 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఎక్సైజ్ ఎస్సై కె.పద్మ, సిబ్బంది సర్వర్, ఎండి మదార్‌పాష, వెంకటేష్, కృష్ణ పాల్గొన్నారు.

కరెంటోళ్ల నిర్లక్ష్యం

- 4 ఎకరాల్లో ఎండిన వరిపంట
- గొర్రెలకు ఆహారంగా వదిలిన రైతు



నెర్రెలుబారిన పొలం

జనగామ: రఘునాథపల్లి మండలం మండెలగూడెం గ్రామానికి చెందిన రైతు మడికంటి మహేందర్‌కు నాలుగెకరాల వ్యవసాయ భూమి(చెలక) ఉంది. వరి సాగు చేయడానికి రెండేళ్ల క్రితం తన సోదరుడితో కలిసి ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుకు రూ.9వేల చొప్పున మూడు డీడీలు తీసి ఎన్పీడీసీఎల్ అధికారులకు అందజేశారు. విద్యుత్ స్తంభాలు బిగించిన అధికారులు.. ట్రాన్స్ ఫార్మర్ మంజూరు చేయలేదు. దీంతో రైతులు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోకపోవడంతో చెలక భూమిలో పత్తి, ఉలువులు తదితర పంటలు సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌కు ముందు బొమ్మకూరు కాల్వ నీరు రావడంతో రైతు మహేందర్ నాలుగు ఎకరాల్లో బాస్మతి వరి సాగు చేయగా రూ.65వేల పెట్టుబడి అయింది. ఈ క్రమంలో కాల్వ నీరు ఆగిపోవడంతో విద్యుత్ అధికారులను కలిసి ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేయగా.. పాత ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. పొలం వద్ద ఉన్న బోరు మోటార్ల ద్వారా పంటకు నీరు అందిస్తున్న క్రమంలో కొద్ది రోజుల క్రితం ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయింది. దానిని పునరుద్ధరించకపోవడంతో నాలుగు ఎకరాల్లో వేసిన బాస్మతి వరి ఎండిపోవడంతో చేసేది లేక సదరు రైతు గొర్రెలు, మేకలకు ఆహారంగా వదిలేశాడు. ఈ విషయమై ఏఈ వినయ్‌ను వివరణ కోరగా తాను కొత్తగా విధుల్లో చేరానని, దీనిపై విచారణ జరిపిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బాధిత రైతు మహేందర్ మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి సాగుచేసిన పంట జీవాలకు వదిలేయాల్సివచ్చింది.. సుమారు రూ.లక్ష వరకు జరిగిన నష్టం ఎవరిస్తారని వాపోయాడు.

ఘనంగా వారకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ భక్తుల సమక్షంలో ఘనంగా వారకల్యాణం నిర్వహించారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో హైదరాబాదుకు చెందిన తరుణి, సంతోషి, ఆసిక, హాసిని, నిర్మల అన్నదానం నిర్వహించారు. ధర్మకర్తలు జంగిటి కుమార్, శ్యాంసుందర్‌రెడ్డి, కుంచాల సంపత్‌రాజు సిబ్బంది రమేష్, వీరన్న, మల్లికార్జున్, విశాల్, మహేష్, హరిశంకర్ భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం రావడం ఖాయం

స్టేషన్‌ఘన్‌పూర్: రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర అన్నారు. ఖమ్మం జిల్లా ఇల్లందులో జరిగిన రేవంత్‌రెడ్డి హాథ్ సే హాత్ జోడో యాత్రలో ఆమె శనివారం పాల్గొన్నారు. అనంతరం త్వరలో ఘన్‌పూర్ నియోజకవర్గంలో నిర్వహించనున్న యాత్రపై రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీ ముఖ్యనాయకులతో ఆమె సమావేశమయ్యారు. అనంతరం ఆమె ఘన్‌పూర్ విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజా సమస్యల్ని నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రణాళికయే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్నారన్నారు. పేదలకు ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. త్వరలో ఘన్‌పూర్ నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డి యాత్ర ఉంటుందని, హాత్ సే హాత్ జోడో యాత్ర ద్వారా గ్రామాల్లో ప్రతీ ఇంటికి కాంగ్రెస్ పార్టీని తీసుకెళ్తామని, రానున్న రోజులు కాంగ్రెస్ పార్టీవేనని, కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

చిల్పూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉడుగుల రమేష్ అన్నారు. పల్లగుట్టలో శనివారం శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ బాల్నె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రజా గోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు తెలంగాణలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, పడుతున్న గోసను ప్రత్యక్షంగా తెలుసుకుని వారికి పార్టీ ఆధ్వర్యంలో భరోసా కల్పించేందుకు సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర ఎల్లయ్య, పార్టీ మండల అధ్యక్షుడు దిలీప్, అశోక్, వాసు, శ్రీను, రాజుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

స్వయం సేవక్‌గా యాదగిరి సేవలు మరువలేనివి



జనగామ: జనగామ ప్రాంత మొదటి తరం స్వయం సేవక్, దివంగత జైన యాదగిరి మృతి మరువలేనిదని తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల క్షేత్ర ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ ప్రముఖ్ గొట్టిముక్కల భాస్కర్, హైదరాబాద్ కేంద్రం ప్రతినిధి రాంపల్లి మల్లికార్జున్, తెలంగాణ ప్రాంత సామాజిక సమరసత సంఘటన ప్రచారక్ అప్పల ప్రసాద్‌జీ, వరంగల్ విభాగ్ ప్రచారక్ కడమంచి విఘ్నేశ్వర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని యాదగిరి కుటుంబాన్ని పరామర్శించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పరామర్శ

కొడకండ్ల: మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీని శనివారం పలువురు నాయకులు పరామర్శించారు. రామోజీ తండ్రి సత్తాజీ గుండెపోటుతో మృతి చెందగా మండల ఎన్నికల ఇన్‌చార్జ్ భానుకిరణ్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే బోడోనికుంట తండా సర్పంచ్ సోమాని భార్య కమల మృతి చెందగా సోమాని కుటుంబసభ్యులను కూడా ఆయన పరామర్శించారు.

బోర్ పనులు ప్రారంభం

చిల్పూరు: మండలంలోని కొండాపూర్ సమీపంలోని సిద్దేశ్వర స్వామి దేవస్థానం వద్ద శనివారం బోర్ పనులను సర్పంచ్ లోడెం రజిత, ఎంపీటీసీ మారబోయిన ఐలమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ పింగిళి యోగానందరెడ్డి మాట్లాడారు. ఉప సర్పంచ్ కొడ సంపత్, వైస్ చైర్మన్ రాజు, రవీందర్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు బాసట

దేవరుప్పుల: పేదలకు బాసటగా సీఎం సహాయ నిధి దోహదపడుతుందని సర్పంచ్ ఈదునూరి రమాదేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మంత్రి దయాకర్‌రావు సహకారంతో మంజూరైన సీఎం సహాయనిధి రూ.1.96 లక్షల చెక్కును లబ్ధిదారుడు నడిదె చంద్రారెడ్డికి అందజేశారు. రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ ఈదునూరి నరసింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, ఎంపీటీసీ రేణుక కిష్టయ్య, వెంకటేశ్వర్లు, వెంకన్న, మల్లయ్య పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

పాలకుర్తి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సర్పంచ్ నాగభూషణం అన్నారు. శనివారం గ్రామంలో నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులను ఆయన ప్రదానం చేశారు. బత్తిని దేవేందర్, కానిస్టేబుల్ పెంతల అశోక్, ఉప సర్పంచ్ సుధాకర్ పాల్గొన్నారు.

పశ్చిమబెంగాల్‌కు తరలిన టీవ్యకాస నేతలు

దేవరుప్పుల: అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం పదో మహాసభలను పురస్కరించుకొని పశ్చిమబెంగాల్‌లో తలపెట్టిన సభలకు శనివారం జిల్లా వ్యకాస నేతలు తరలివెళ్లారు. ప్రధాన కార్యదర్శి ఎదులూరి వెంకట్రాజం, కుమార్, రాజేశ్వరీ తదితరులు ఉన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయండి

దేవరుప్పుల: ఈ నెల 14వ తేదీన మండల కేంద్రం నుంచి కొనసాగే టీపీసీసీ ఛీఫ్ రేవంత్‌రెడ్డి పాదయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి తెలిపారు. జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి పర్యవేక్షణలో ధర్మాపురం, విస్నూర్ మీదుగా పాలకుర్తి కేంద్రం వరకూ హాథ్ సే హాథ్ జోడో అభియాన్ పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని తమ సమస్యలను తెలియజేయాలని కోరారు.

నేడే మండల సమావేశం

బచ్చన్నపేట: మండల సర్వ సభ్యసమావేశాన్ని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నేడు(ఆదివారం) నిర్వహించనున్నట్లు ఎంపీపీ నాగజ్యోతి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి హాజరవుతారని అన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు ఉదయం 11 గంటలకు సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

క్రీడాకారులకు అభినందనలు

రఘునాథపల్లి: పాలకుర్తి మండలం వావిలాలలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో రఘునాథపల్లి జట్టు అత్యుత్తమ ప్రతిభ చాటి ద్వితీయ బహుమతి సాధించిన క్రీడాకారులను జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ పోకల శివకుమార్ అభినందించారు. శనివారం క్రీడాకారులు మండల కేంద్రంలో సర్పంచ్‌ను కలిసి వారు సాధించిన షీల్డ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొని గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని పేర్కొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

పాలకుర్తి: ఊహించని విధంగా వరిపంటలకు సోకిన తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏడీఏ పర్శరాం నాయక్ సూచించారు. శనివారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించి వరి పంటకు సోకిన తెగుళ్లను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో వాల్మీకి బోయలతో పాటు బేదర, కిరాత, మాలి, తలయారి, చండు, కాయితీ లంబాడ, బాట్ మధురాలు, చమర్ మధురాలను ఎస్టీ తెగల జాబితాలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం అంసెబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా నాయకుడు నునావత్ సుమన్‌నాయక్ డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ఓటుబ్యాంకు రాజకీయాల కోసం ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తీర్మానం చేయడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్టీల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, గిరిజనులకు రిజర్వేషన్లను పెంచకుండా కొత్తగా బీసీ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే నిర్ణయం సరికాదన్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం



బచ్చన్నపేట: కొడవటూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం-1లో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేసినట్లు అంగన్‌వాడీ టీచర్ ప్రేమలక్ష్మి తెలిపారు. శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పుట్టిన రోజు వేడుకలు, అన్నప్రాసన, అక్షరాభ్యాసం లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. మమత, సంధ్య, రోజా, దీక్షిత ఉన్నారు.

మండల సభ బహిష్కరణ

- ప్రభుత్వ కార్యక్రమాలపై సమాచారం ఇవ్వడంలేదని ఆగ్రహం



సభలో ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ కనకయ్య

జఫర్‌గఢ్: ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలపై తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడంలేదని ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. ఎంపీపీ రడపాక సుదర్శన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. సభ ప్రారంభం సమయంలో ఉప్పుగల్లు ఎంపీటీసీ సభ్యుడు, వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య మాట్లాడుతూ గ్రామ శివారు మాసిరెడ్డిగూడెంలో మినీ అంగన్‌వాడీ ప్రారంభం విషయంలో తనకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని సభ దృష్టికి తీసుకవచ్చారు.ఎంపీటీసీ లేకుండా మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎలా ప్రారంభిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మిగతా ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల విషయంలో సంబంధిత అధికారుల నుంచి తమకు ఎలాంటి సమాచారం అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులైన తమకు కనీస గౌరవం లేనప్పుడు సభలో కూర్చోవడం ఎందుకని మండల సభను బహిష్కరించారు. దీంతో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు ఇల్లందుల బేబి శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి సభ నుంచి బయటకు వెళ్లిన ఎంపీటీసీ సభ్యులతో మాట్లాడుతూ అధికారుల నుంచి సమాచారం అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో సభ యథావిధిగా కొనసాగింది. అనంతరం ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ సుదర్శన్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. పలు శాఖల పనితీరుపై చర్చించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బేబి, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, సింగిల్ విండో చైర్మన్ కర్ణాకర్‌రావు, వైస్ ఎంపీపీ కనకయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట తప్పితే ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి



మాట్లాడుతున్న ప్రతినిధులు

జనగామ: గొర్రెల పంపిణీలో నగదు బదిలీ కాకుండా.. పాత పద్ధతిని తెరపైకి తీసుకొస్తే ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు మోటే దేవేందర్, కార్యదర్శి సాదం రమేష్ హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మునుగోడు ఉప ఎన్నికల సమయంలో నగదు బదిలీ ద్వారా గొర్రెలు పంపిణీ చేస్తామని గొల్ల కురుమలకు ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఎన్నికలు ముగియడంతో పాత పద్ధతి కొనసాగించేందుకు సర్కారు నిర్ణయించినట్లు తెలుస్తోందన్నారు. మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి గుండెల్లి రాజు, రేగు వీరస్వామి, దయ్యాల మల్లయ్య, డి. భాస్కర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్

జనగామ రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీనివాస్ అన్నారు. వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు మండలంలోని పెద్దరాంచర్లలో శనివారం జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యాన కళాజాతా నిర్వహించారు. బాల్యవివాహాలు అరికట్టడం, రోడ్డు ప్రమాదాలు, బాలకార్మికుల నిర్మూలన, డయల్ 100, గుట్కా, గంజాయి, డ్రగ్స్, సీసీ కెమెరాల ఉపయోగంపై అవగాహన కల్పించారు. కళా బృందం ఇన్‌చార్జ్ నాగమణి, కళాకారులు వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్ రాజ్, ,చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాకారులు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. శనివారం జనగామ చౌరస్తాలో కళాకారులు ఆటపాటలో అవగాహన కల్పించారు. ఎస్సై శ్రీనివాస్, టీం లీడర్ సంజీవ, శంకర్, సాంబయ్య, రవి, శ్రీనివాస్ ఉన్నారు.

లబ్ధిదారులను మోసం చేస్తున్న ప్రభుత్వం

- సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మోకు కనకారెడ్డి

జనగామ రూరల్: పట్టణంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇండ్లు ఇవ్వకుండా కాలాయాపన చేస్తూ ప్రభుత్వం మోసం చేస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం పందిళ్ల కళ్యాణి అధ్యక్షతన నిర్వహించిన మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013లో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చినా నేటికీ భూమి చేపలేదన్నారు. ఆ స్థలంలో డబుల్ బెడ్రూంలు కట్టిస్తామని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి చేప్పారని, అయితే ప్రస్తుత రెవెన్యూ అధికారులు వార్డు సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామడం హేమమైన చర్య అన్నారు. ఐదేళ్ల నుంచి కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ తదితర అధికారులు ఇందిరమ్మ లబ్ధిదారులను మభ్యపేడుతూ వస్తున్నారని మండిపడ్డారు. ఇళ్ల నిర్మాణం కాకముందే ఎంపిక ఎలా చేస్తారని ప్రశ్నించారు. నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని, లేదంటే న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, ఇర్రి అహల్య, బొట్ల శ్రీనివాస్, గోపి, విజేందర్, అజారుద్దీన్, వెంకటమల్లయ్య, లింగం, శ్రావణ్, రజిత, జయ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి జన్మదిన వేడుకలు



జనగామ: ఎంసీహెచ్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



జనగామ: కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

జనగామ/ బచ్చన్నపేట/నర్మెట/తరిగొప్పుల/ జనగామ రూరల్ : జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి జన్మదిన వేడకలను పట్టణంతోపాటు జిల్లాలోని పలు మండలాల్లో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ గోదావరి జలాలను తరలించి ఎడారిగా మారిన ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత ఎమ్మెల్యే ముత్తిరెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జనగామ రూరల్: కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ మేకల కళింగరాజు, ప్రజా ప్రతినిధులు



బచ్చన్నపేట: కేక్ కట్ చేస్తున్న రైతుబంధు సమితి జిల్లా కో ఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి

సోమేశ్వర ఆలయంలో శత చండీయాగం

- నేటి నుంచి అమ్మవారి ప్రతిష్ఠాపనోత్సవాలు



ఆలయంలో నిర్మించిన అమ్మవారి గుడి

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శ్రీచండికా అమ్మవారి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. 12న కలశస్థాపన, 13న జలాధివాసం, 14న దాన్యాధివాసం, 15న పుష్పాధివాసం, శయ్యాధివాసం, 16న చండికా అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవం ఉంటుంది. ఇందుకోసం వేద పండితులు నిత్యం రుద్రహోమ సహిత శతచండీయాగం నిర్వహించనున్నారు. ఉత్సవాల ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సతీమణి ఉషాదయాకర్‌రావు హాజరుకానున్నారని ఆలయ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, ఈఓ రజనీకుమారి తెలిపారు. ఇదిలా ఉండగా.. ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన వసతులు కల్పిస్తున్నారు. ఏర్పాట్లను సీఐ విశ్వేశ్వర్, ఎస్ఐ శ్రీకాంత్, ఆలయ అధికారులు శనివారం పరిశీలించారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు



ఆలయ గోపురం, (ఇన్‌సెట్‌లో) స్వయంభూ శివలింగం

బచ్చన్నపేట: కొడవటూరులోని సిద్దుల గుట్ట మహా శివరాత్రి పండుగ సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. భక్తుల కొంగు బంగారంగా కీర్తించబడుతున్న సిద్దుల గుట్ట లింగాకారంలో ఉండి నంది ఆకారంలో కోరిన భక్తుల కోర్కెలను తీరుస్తోంది. చిన్న కొండ సొరికల్లో వెలసిన శివలింగం ప్రతీ సంవత్సరం చింతాకు పరిమాణంలో పెరుగుతూ నిత్య పూజలను అందుకుంటుంది. ఆలయంలో గణపతి, భైరుడు, నవగ్రహాల దేవాలయాలు కూడా ఉన్నాయి. ఈ గుట్ట నుంచి బందనాగారంలోని రామలింగేశ్వరాలయం, కొన్నె గజగిరి గుట్ట, కొలనుపాకలోని సోమేశ్వరాలయానికి సొరంగ మార్గాలు కూడా ఉన్నాయి. ఈ నెల 16 నుంచి మార్చి 19వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. అగ్ని గుండాలు, శివపార్వతుల కల్యాణం జరుపుతారు. కొడవటూరుకు హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, సిద్దిపేట పట్టణాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తారు.